

"పరిశీలకునినుండి వచ్చే స్పందన
ఒక అలవాటుగా ఆనవాయితీగా
వస్తున్న ప్రతిస్పందన.
ఇది పాత మెదడు
ఇస్తున్న ప్రతిస్పందన."


అంతరంగయాత్ర
జె. కృష్ణమూర్తి బోధనలతో కూర్చిన ప్రచురణ
ANTHARANGA YATRA
KRISHNAMURTI FOUNDATION INDIA    APRIL - JULY 2013    Rs.2/- VOL. VII ISSUE 3


# సంపూర్ణతను సందర్శించడం

ప్రశ్నిస్తున్నవారు : మీ మాటలు వింటున్నప్పుడు మీరు చెప్తున్నది అర్థమైనట్లుగా అనిపిస్తుంది. కేవలం వాచ్యంగా అర్థమవడమే కాకుండా బాగా లోతుగా, లోపలి స్థాయిలో కూడా అర్థమైనట్లు తోస్తుంది. అందులో కలిసి ఒకటైపోతాను. మీరు చెప్తున్న విషయంలోని సత్యాన్ని నా సమస్త ప్రాణంతో సంపూర్తిగా గ్రహిస్తాను. నా వినికిడి బాగా పదునెక్కుతుంది. ఆ పూలను, ఆ చెట్లను, మంచుతో కప్పేసుకున్న ఆ పర్వతాలను చూసీ చూడగానే వాటిలో నేను కలిసి ఒకటైపోయినట్లుగా అనిపిస్తుంది. ఇటువంటి ఈ ఎరుకలో నాలో ఏ సంఘర్షణా వుండదు. ఎటువంటి పరస్పర వైరుధ్యమూ వుండదు. ఏదైనా సరే నేను చేయగలను అనిపిస్తుంది. ఏది చేసినా అది సత్యపూరితంగా వుంటుంది. ఎందుకంటే దానివలన సంఘర్షణ గాని, బాధ గాని జనించదు. అయితే దౌర్భాగ్యం ఏమిటంటే ఆ స్థితి ఎంతోసేపు నిలవదు. బహుశ ఒక గంటసేపో, రెండు గంటల పాటో మీరు చెప్తున్నది వింటున్న సమయంలో వుంటుందేమో. అంతే. ఈ ప్రసంగాలు ముగిశాక నేను వెళ్ళిపోయాక అదంతా కూడా ఆవిరై ఎగిరిపోతుంది. మళ్ళీ పూర్వపు యథాస్థితిలో పడిపోతాను. నా గురించిన ఎరుక తెచ్చుకోవాలని ప్రయత్నిస్తాను. మీ ప్రసంగాలు వింటున్నప్పుడు నేను వుండిన ఆ స్థితిని గుర్తుకు తెచ్చుకుంటాను. ఆ స్థితిని అందుకోవాలని, దానిని పట్టుకొని వుంచుకోవాలని ప్రయత్నిస్తూ వుంటాను. ఇదే ఒక పోరాటంలా తయారవుతుంది.

'మీలోని సంఘర్షణ గురించి ఎరుకతో వుండండి. ఆ మీ సంఘర్షణను శ్రద్ధగా వినండి. సంఘర్షణ వెనుక గల కారణాలను చూడండి. మీరే మీ సంఘర్షణ.' అని మీరు అన్నారు.

నాలో సంఘర్షణ, నాలో బాధ, నాలో దుఃఖము, నాలో గందరగోళమూ వున్నాయనే ఎరుక నాకు వున్నది. అయితే ఈ ఎరుకవలన అవి ఏ రకంగానూ పరిష్కారం అవడంలేదు. పైగా వాటి గురించిన ఈ ఎరుక కారణంగా అవి మరింత బలం పుంజుకొని ఎక్కువ కాలం కొనసాగుతుంటాయి. ఎంపికలేని ఎరుక అని మీరు అంటూ వుంటారు. ఇది నాలో మరో పోరాటాన్ని సృష్టిస్తుంది. ఎందుకంటే నాలో వున్నదంతా ఎంపికే–ఇష్టాయిష్టాలు, నిర్ణయాలు, అభిప్రాయాలు. నాకుగల ఒక అలవాటు విషయంలో ఈ ఎరుకను ప్రయోగించి చూశాను. ఏమీ కాలేదు. ఆ

☞ 2

## జీవితపు సారాంశం ఏమిటి?
## కళాత్మకంగా కృష్ణమూర్తి బోధల అభివ్యక్తం

నిత్యజీవనంలోని ఒత్తిడులు, ఘర్షణలు, అశాంతి, ఆందోళన, పరుగులు, పోటీలు, పలుపలు రకాల ఆకర్షణలు, వికర్షణలు మనిషిని అతలాకుతలం చేస్తుంటే ఆత్మీయత, ఆర్ద్రత, దయ, సానుభూతి, సహృదయత, సౌకుమార్యం ఎక్కడున్నాయి, అసలు వున్నాయా లేవా అని అన్వేషించాల్సి వస్తున్న కాలం ఇది.

వీటిని గురించి విపులీకరిస్తూ పరిపూర్ణవంతమైన జీవనం అనే అద్భుతమైన విశాల విస్తృత రంగభూమిని ఆవిష్కరించి చూపుతాయి జె. కృష్ణమూర్తి బోధలు.

ఈ బోధల స్ఫూర్తితో సృజించిన సంగీత నృత్య కళాకార్యక్రమం Essence of Life ఎసెన్స్ ఆఫ్ లైఫ్ హైద్రాబాదు నగరంలోని రవీంద్రభారతిలో మే 11వ తేదీన ప్రదర్శించబడబోతున్నది. చెన్నయి బెంగుళూరులలో ఈ ప్రదర్శనను వీక్షించిన ప్రేక్షకులు ముగ్ధులై ఇది ఒక అపూర్వమైన అనుభవం అన్నారు.

ప్రతివారూ ప్రతిరోజూ ఎదుర్కొంటున్న భయాలు, హింస, ద్వేషం, అసూయ, మానసిక గాయాలు, మరణం వంటి అస్తిత్వ సమస్య లన్నింటిని కృష్ణమూర్తి కూలంకషంగా చర్చించి మనిషి అంతరాళాన్ని ఆవిష్కరించి చూపారు. వీటినుండి విముక్తమవడం మన చేతుల్లోనే వున్నదని కూడా విశదపరిచారు.

ధ్యానం ఒక కళ అని చెప్తూ, మనసు పనిచేసే తీరును అర్థంచేసుకుంటూ, ధ్యానాత్మకమైన జీవితం గడుపుతుంటే హృదయం మేల్కొంటుంది అంటారు. హృదయం మేల్కొంటే సౌందర్యంతో ప్రేమతో కరుణతో ఆనందంతో జీవితం ప్రఫుల్లమవుతుంది.

ఈ అంశాలను వివిధ భారతీయ నృత్య రీతుల్లో (ఒడిస్సీ, కూచిపూడి, భరతనాట్యం, మోహినియాట్టం, కథక్), గీతగానాల సహకారంతో ప్రఖ్యాత నర్తకులు నైపుణ్యవంతంగా ఈ **ఎసెన్స్ ఆఫ్ లైఫ్** ప్రదర్శనలో వ్యక్తీకరిస్తారు. డేగా దేవ్‌కుమార్ నిర్మించిన ఈ ప్రయోగాత్మక కార్యక్రమం **ఎసెన్స్ ఆఫ్ లైఫ్** జీవనసారభపు ఆస్వాదన

వివరాలకు : www.degaarts.com

అలవాటు అలాగే వుండిపోయింది. ఏదో ఒక సంఘర్షణను గురించో, ఒత్తిడిని గురించో ఎరుక కలిగినప్పుడు ఆ ఎరుకే మళ్ళీ ఆ సంఘర్షణ, ఒత్తిడీ పోయాయా లేదా అని చూస్తుంటుంది. ఇదే వాటిని గురించి మళ్ళీ గుర్తుచేస్తున్నట్లుగా అనిపిస్తుంది. ఇక దానిని నేను వదిలించుకోనే వదిలించుకోలేను.

కృష్ణమూర్తి : ఎరుక అంటే–దేనికైనా సరే, ఏదో ఒకదానికి కట్టుబడి వుండటంకాదు. ఎరుక అంటే ఒక పరిశీలన. బాహ్యమైనదీ అంతర్గత మైనదీ కూడా అయిన పరిశీలన. ఆ పరిశీలనలో దిశానిర్దేశం ఆగిపోతుంది. మీరు ఎరుకతో వున్నారు. అయితే ఏ విషయం గురించి ఐతే ఎరుకగా వున్నారో ఆ విషయాన్ని నిరుత్సాహపరచడమూ లేదు. పోషణ చేయడమూ లేదు. ఏదో ఒకదానిపై ఏకాగ్రత చూపడం కూడా ఎరుకకాదు. ఫలానా దాని గురించి ఎరుకగా వుండబోతున్నాను అనే ఎంపిక చేసుకునే సంకల్పక్రియ కాదు ఎరుక అంటే. ఒక ఫలితాన్ని రాబట్టడం కోసం ఆ విషయాన్ని విశ్లేషించడమూ కాదు. కావాలని ప్రత్యేకంగా ఒక అంశంపై కేంద్రీకరించడం–ఉదాహరణకు సంఘర్షణపై–అంటే అది సంకల్పక్రియ అవుతుంది. అదే ఏకాగ్రత. ఏకాగ్రత చూపినప్పుడు, అంటే మీరు ఎంపిక చేసుకున్న పరిధి లోపలగా మీ శక్తిని, మీ ఆలోచనలను కేంద్రీకరించినప్పుడు – ఉదాహరణకు ఒక పుస్తకం చదవడంపై గాని, మీ కోపాన్ని గమనించడంపై గాని పెట్టినప్పుడు, అటువంటి ప్రత్యేకీకరణలో దేనిపైనయితే మీరు ఏకాగ్రత చూపుతున్నారో ఆ విషయం ఇంకా బలం పుంజుకుంటుంది. వృద్ధి చెందుతుంది. అందుచేత ఇక్కడ ఎరుక గుణతత్వాన్ని మనం సరిగ్గా అర్థంచేసుకోవాలి. ఎరుక అనే మాటను వుపయోగిస్తున్నప్పుడు మనం ఏం మాట్లాడుతున్నాము అనేది మనకు అర్థమవాలి.

సరే, ఒక ఫలానా అంశం గురించి ఎరుకతో వుండటం వున్నది. ఆ ఫలానా అంశం ఒక మొత్తంలోని భాగంగా ఎరిగి వుండటం కూడా వున్నది. ఒక ప్రత్యేకించిన ఫలానా భాగానికి పెద్దగా విలువలేదు. అయితే మొత్తాన్ని చూస్తున్నప్పుడు, ఆ సంపూర్ణ సమస్తంతో ఈ ప్రత్యేక భాగానికి ఒక సంబంధం వుంటుంది. ఈ సంబంధంలోనే ఆ ప్రత్యేక భాగానికి ఒక సరియైన అర్థం, ఒక విలువ వుంటుంది. అది అతిగా ప్రాధాన్యతనూ సంతరించుకోదు, దానిని పెద్దదిగా చేయడమూ జరుగదు. అందుచేత అసలు ప్రశ్న ఏమిటంటే : జీవిత సంపూర్ణ ప్రక్రియను మనం చూస్తున్నామా లేక ఒక ప్రత్యేక భాగం పైన కేంద్రీకరించి చూస్తున్నామా. అట్లా చేయడంతో జీవిత పరిపూర్ణ క్షేత్రాన్ని దర్శించలేకపోతున్నామా? పరిపూర్ణ క్షేత్రపు ఎరుక కలిగి వుండటము అంటే ప్రత్యేక భాగాన్ని చూడటం కూడా అందులో చేరివుంటుంది. అంతేకాకుండా, ఆ ప్రత్యేక భాగానికి మొత్తంతో వుండే సంబంధాన్ని అర్థంచేసుకోవడం కూడా అందులో వుంటుంది. మీకు కోపం వున్నది. మీ ఈ కోపాన్ని పరిహరించాలనే ఒక అపేక్ష కూడా వున్నది. అటువంటప్పుడు మీ సావధానతను కోపంమీద కేంద్రీకరిస్తారు. దానితో ఆ మొత్తం–పరిపూర్ణ క్షేత్రం మీ దృష్టినుండి తప్పించుకుంటుంది. అప్పుడు కోపం మరింత బలంగా తయారవుతుంది. అయితే ఈ కోపం మొత్తంతో సంబంధం కలిగివున్నటువంటిది. అందుచేత మొత్తంనుండి ఒక భాగాన్ని ప్రత్యేకంగా వేరుచేసినప్పుడు ఆ ప్రత్యేకంగా విడదీసిన అంశం తనవైన మరి ఎన్నో సమస్యలను పుట్టిస్తుంది, పెంచుతుంది.

ప్ర. : సంపూర్ణాన్ని – మొత్తాన్ని చూడటము అంటే ఏమిటి? మీరు చెప్తున్న ఈ సమస్త మొత్తం అంటే ఏమిటి? ఫలానా ఫలానా విషయాలు అన్నీ కూడా అందులోని చిన్న చిన్న అంశాలు అయినటువంటి ఆ విస్తృత విశాలమైన ఎరుక అంటే ఏమిటి? అది ఒక రకమైన మార్మికతా? నిగూఢాత్మకమైన అనుభవమా? అటువంటి దేదైనా కనుక అయితే ఇక మన పని సున్నాయే. లేదా మీరు అంటున్నది ఇదా–అస్తిత్వము అనేది ఒక సువిశాల సంపూర్ణ క్షేత్రము. అందులో కోపం ఒక అంశము. ఆ ఒక అంశం గురించే పట్టించుకోవడం అనేది విశాల విస్తారమైన దృష్టిగ్రాహ్యతకు ఆటంకమవుతుంది–అని అంటున్నారా? కానీ అందులోని ఆ ప్రత్యేక భాగాల ద్వారా మాత్రమే నేను ఆ సంపూర్ణ సమస్తాన్ని చూడగలుగుతాను. సరే, మీరు చెప్తున్న ఆ సంపూర్ణ సమస్తం–ఆ క్షేత్రం అంటే ఏది? మనసు సర్వస్వం అనే అర్థంలో అంటున్నారా? లేదూ సంపూర్ణ సమస్త అస్తిత్వం గురించి చెప్తున్నారా? లేదూ నేను అనే సమస్తాన్ని గురించి చెప్తున్నారా? లేదూ జీవిత సమస్తం గురించి చెప్తున్నారా? మీరు చెప్తున్న ఆ సమస్తమైన మొత్తం అంటే ఏది? దానిని నేను ఎట్లా దర్శించకలుగుతాను?

కృ. : జీవితము అనే ఆ మొత్తం సమస్తమైన క్షేత్రం. ఈ మనసు, ప్రేమ, జీవితంలోగల ప్రతిదీ కూడా.

ప్ర. : అదంతా నేను చూడగలనా? అది సాధ్యమా? నేను చూస్తున్న ప్రతిదీ ఒక పాక్షికమైన అంశం అని నాకు అర్థమైంది. నా ఎరుక అంతా కూడా ఒక ప్రత్యేక అంశం ఎడల ఎరుక అనీ, ఇది ఆ ప్రత్యేక అంశాన్ని ఇంకా బలంగా చేస్తున్నదనీ కూడా అర్థమైంది.

కృ. : ఇంకో రకంగా వివరిస్తాను. మీ మనసుతోను, మీ హృదయంతోను విడివిడిగా పరికిస్తున్నారా? లేక చూడటం, వినడం, ఉద్వేగపడటం, ఆలోచించడం మొదలైన వాటన్నింటితోపాటు కలసి చేస్తున్నారా? వేరు వేరు ముక్కలుగా విచ్ఛిన్నపరచి చూస్తున్నారా?

ప్ర. : మీరు ఏమంటున్నారో నాకు తెలియడంలేదు.

కృ. : ఒక మాటను మీరు వింటారు. అది ఒక దూషణ–తిట్టు అని మీ మనసు చెబుతుంది. మీ మనోద్వేగాలు మీలోని అయిష్టతను తెలుపుతాయి. అప్పుడు మళ్ళీ మీ మనసు కలగజేసుకొని దీనిని అదుపు జేయాలనో సమర్థించాలనో చూస్తుంది. ఇంకా ఇటువంటి అవీ ఇవీ చేస్తుంది. మనసు ఒక నిర్ణయానికి వచ్చాక తిరిగి మనోద్వేగాల పెత్తనం మొదలవుతుంది. ఈ రకంగా ఒక సంఘటన జరగడమూ, మీరు అనే జీవిలోని వివిధ భాగాలనుండి ప్రతిస్పందనల గొలుసు ఛెళ్ళున బయటపడటమూ. మీకు వినబడిన మాటను ముక్కలుచేసి విచ్ఛిన్నపరచడం జరిగింది. ఆ ముక్కలలో ఒకదాని మీద కేంద్రీకరించినప్పుడు శ్రవణము అనే సంపూర్ణ ప్రక్రియ మీకు అందకుండా పోతున్నది. శ్రవణము–వినడము పాక్షికంగానూ చేయచ్చు. లేదా మీ సమస్త ప్రాణంతోనూ–అంటే అది సంపూర్ణ శ్రవణం–చేయచ్చు. అందుచేత సమస్తమైన మొత్తం యొక్క పరిగ్రాహ్యత అంటే మీ కనులతో, మీ చెవులతో, మీ హృదయంతో మీ మనసుతో చూడటం, పరిగ్రహించడం. ఒక్కొక్కదానితో విడివిడిగా చూసి గ్రహించడం కాదు. అంటే మీ పరిపూర్ణ సావధానతను చూపడం. అటువంటి సావధానతలో కోపము వంటి ఒక్కొక్క ప్రత్యేక అంశానికి అర్థం భిన్నంగా వుంటుంది. ఎందుకంటే ఆ అంశం అనేక ఇతర విషయాలతో ముడిపడి వుంటుంది.

ప్ర. : సమస్త మొత్తాన్ని, అంటే



☞ 3

సంపూర్ణతను చూడటం అంటే మన సంపూర్ణ అస్తిత్వంతో చూడటం అని కదా మీ అర్థం. అంటే ఇక్కడ గుణం ప్రధానం కాని పరిమాణం ప్రధానం కాదు కదూ. అవునంటారా?

కృ. : కచ్చితంగా అంతే. అయితే మీరు సమస్తాన్నీ మొత్తంగా చూస్తున్నారా లేదూ ఊరికే మాటలలో అది వ్యక్తపరుస్తున్నారా? కోపాన్ని మీ హృదయంతో మనసుతో చెవులతో కనులతో చూస్తున్నారా? లేక కోపాన్ని, దానికి మీ తక్కిన అస్తిత్వంతో ఏ సంబంధమూ లేనట్లుగా చూస్తున్నారా? ఆ విధంగా కోపానికి అమితమైన ప్రాధాన్యతను ఇస్తున్నారా? సంపూర్ణ మొత్తానికి ప్రాధాన్యతను ఇచ్చి నప్పుడు ప్రత్యేక అంశాలను మరచిపోవడం జరగదు.

ప్ర. : కానీ ఆ ప్రత్యేక అంశం–కోపం ఏమవుతుంది?

కృ. : మీ సంపూర్ణ అస్తిత్వంతో మీ కోపం ఎడల ఎరుకగా వుంటారు. అట్లా వున్నట్లయితే కోపం ఉండిపోతుందా? అనవధానతే కోపం. సావధానత కాదు. కాబట్టి మీ సమస్త అస్తిత్వంతో సావధానంగా వుండటమే సంపూర్ణతను చూడటం. అనవధానత అంటే ఒక ప్రత్యేక అంశాన్ని చూడటం. సంపూర్ణతను, ప్రత్యేక అంశాన్ని, ఆ రెండింటికి గల సంబంధాన్ని చూసి ఎరుకగా వుండటమే అసలైన సమస్య. ప్రత్యేక అంశాన్ని తక్కిన వాటినుండి విడదీసి, దాని పరిష్కారం కోసం మనం ప్రయత్నిస్తుంటాం. అందుచేత సంఘర్షణ ఎక్కువవుతుందే తప్ప దారి కనబడదు.

ప్ర. : మీరు ఏమంటున్నారంటే – కోపంవంటి ఒక ప్రత్యేక అంశాన్ని మాత్రమే చూడటము అంటే మన అస్తిత్వంలోని ఒక భాగంతో మాత్రమే చూడటము అని అర్థం అని కదూ.

కృ. : ఒక ప్రత్యేక అంశాన్ని మీ అస్తిత్వంలోని ఒక ముక్కతో చూస్తున్నప్పుడు ఆ ప్రత్యేక అంశానికి, దానిని చూస్తున్న ముక్కకు మధ్యనగల విభజన ఇంకా పెరుగు తుంది. అందుచేత సంఘర్షణ కూడా ఎక్కువవు తుంది. విభజన లేనప్పుడు సంఘర్షణ వుండదు.

ప్ర. : కోపంవైపు నా సమస్త అస్తిత్వం తోను చూస్తున్నప్పుడు కోపానికి నాకు మధ్య ఏ విభజనా వుండదని మీరు అంటున్నారా?

కృ. : సరిగ్గా అంతే. నిజంగా మీరు చేస్తున్నది ఇదేనా లేక ఊరికే నా మాటలను అనుసరించి చెప్తున్నారా? నిజంగా వాస్తవంగా జరుగుతున్నది ఏమిటి? మీ ప్రశ్నకంటె ముఖ్యమైన సంగతి అదీ.

ప్ర. : ఏం జరుగుతున్నది అని మీరు అడుగుతున్నారు. మిమ్మల్ని అవగాహన చేసుకోవాలని మాత్రమే నేను ప్రయత్నిస్తున్నాను.

కృ. : నన్ను అర్థంచేసుకోవాలని ప్రయత్నిస్తున్నారా లేక ఇప్పుడు మనం మాట్లాడుకుంటున్న దానిలోని సత్యాన్ని చూస్తున్నారా? మనం మాట్లాడుకుంటున్న విషయంలోని సత్యాన్ని కనుక మీరు నిజంగానే చూస్తున్నట్లయితే, అప్పుడిక మీకు మీరే గురువు. మీకు మీరే శిష్యులు. అంటే మిమ్మల్ని మీరే అవగాహన చేసుకోవడం. ఈ అవగాహనను మరొకరివద్దనుండి నేర్చు కోవడం సాధ్యపడదు.

('అర్జెన్సీ ఆఫ్ ఛేంజ్' నుండి, పుటలు 58–62)

## అంతమవడంలో నుండి ఒక క్రొత్తదనం వస్తుంది

**మ**రణం గురించి మాట్లాడాలని అనుకుంటున్నాం. అవునా? మహాసంక్లిష్ట పూరితమైన ఆ విషయంలోకి వెళ్ళేముందు కాలం అంటే ఏమిటో చూద్దాం. దానికి, అంటే కాలానికి సంబంధించినది కాబట్టి స్థలం–ప్రదేశం అంటే ఏమిటని కూడా పరీక్షించి చూద్దాం. అవి రెండూ పరస్పర సంబంధం కలవి. ఏ సమస్య అయినా సరే, అది ఎంత సంక్లిష్టమైనదైనా సరే, ఏదీ విడిగా గిరిగీసుకొని వుండదు. ప్రతి ఒక్క సమస్యకూ ఇతర సమస్యలతో సంబంధం వుంటుంది. అందుచేత ఒక సమస్యను, ఒక అంశాన్ని వేరుగా విడదీసి పట్టుకొని, తక్కిన వాటిని వదిలివేయడం సాధ్యంకాదు. అన్ని సమస్యలనూ తీసుకో వలసిందే. లేదా అంటే ఒక సమస్యను సంపూర్తిగా అవగాహన చేసుకొని, హేతుబద్ధంగా, తార్కికంగా, స్థిరచిత్తంతో, నిష్పక్షపాతంతో ఆ సమస్య యొక్క అంతు చూసినప్పుడు తక్కిన ఇతర సమస్యలను కూడా పరిష్కరించుకోగలుగుతాము.

ఈ ప్రపంచంలో, ఈ దేశంలో కూడా జరుగుతున్నదంతా పరిగణనలోకి తీసు కున్నప్పుడు–ఆ గందరగోళము, ఆ క్షీణత, క్రమక్రమంగా దిగజారిపోవడము, ఆ దుర్నీతి, విభజనలు, దారుణ బాధలు–ఇవన్నీ చూసి నప్పుడు, మనం అందరమూ మారాలి అనీ, మరో విభిన్నమైన ప్రపంచాన్ని నిర్మించు కోవాలనీ, పూర్తిగా విభిన్నమైన మరో నవ్య సమాజాన్ని–ఇక్కడే కాదు, తక్కిన ప్రపంచంలో కూడా–ఏర్పరచుకోవాలనీ అభిలషించడం సహజమే. మొత్తం ప్రపంచంలో మనం కూడా ఒక భాగం. ప్రపంచం వేరుగా, మనం వేరుగా లేము. ఈ విపరీతమైన సంక్షోభాన్ని, ఈ మహా గందరగోళాన్ని, ఈ దారుణ పరిస్థితులనీ చూస్తున్నప్పుడు, ప్రత్యేకంగా ఒక జాతి ఆర్థిక, రాజకీయ స్థితిగతులను మాత్రమే తీసుకోవడం గాని, శాస్త్రవిజ్ఞానం నుండి వీటిని విడదీసి చూడటంగాని కూడదని నేను అను కుంటున్నాను. జీవితం అనే ఆ సమస్త ప్రవాహాన్ని పరిగణనలోకి తీసుకోవాలి. అది ప్రయోగశాలలో వుండవచ్చు. ఆర్థిక రంగంలో వుండచ్చు లేదా ధార్మిక క్షేత్రం అని అనబడే దానిలోనూ వుండవచ్చు. అదంతా కలిపి ఒకటిగా, ఒకే మొత్తంగా తీసుకోవాలి. ఇదీ మన సమస్య. విచ్ఛిన్నం చేయకుండా, విభజించకుండా సమస్త జీవిత చలనాన్ని ఒకే ఒక ఖండంగా–అంశంగా తీసుకోవడం. దానితో వ్యవహరించడం. ఈ జీవితచలన ప్రవాహంలో కాలం వున్నది, స్థలం వున్నది, ప్రేమ ఉన్నది, మృత్యువూ వున్నది.

సాధారణంగా మనం మృత్యువును జీవితం నుండి విడదీస్తాం. ప్రేమను జీవితాన్ని, కాలాన్ని ప్రేమను వేరుపరుస్తాం. కాబట్టి, మరణం అంటే ఏమిటి అనేది అర్థం చేసుకోవాలంటే కాలము, ప్రేమ అనే ప్రశ్నను కూడా అర్థంచేసుకోవాలి. ఈ సాయంత్రం మనం చేయబోయేది అదే. మనం అందరమూ కలిసి ఆ పని చేద్దాం. 'కలిసి' అని ఎందు కంటున్నానంటే ఇది మనందరి సమస్య కాబట్టి. ఇది మానవ సమస్య. అందుచేత మనందరమూ కలిసి ఇది పరీక్షించాలి, అర్థంచేసుకోవాలి, ఒకరికొకరం చెప్పుకోవాలి, మాట్లాడుకోవాలి, పంచుకోవాలి. అంటే అర్థం, మీలో కూడా కనిపెట్టాలనే ఆ తీవ్రత, ఆ గాఢావేశం వుండాలి. అంతేకాని కేవలం ఈ వక్తమీద ఆధారపడటం కాదు. అందుచేత క్లిష్టమైన ఈ ప్రశ్నను పరిగణనలోకి తీసుకున్నప్పుడు మీ మొత్తం సావధానతను దీనిపై వుంచడం అవసరం. సహజంగానే గాఢావేశం కూడా వుండాలి. ఎందుకంటే తీవ్రమైన ఆవేశం లేకుండా ఏదీ అర్థం చేసుకోలేము. అటువంటి ఆవేశం దుః ఖపు జ్వాలలో నుండి ఎగసి వస్తుంది. అందుచేత,

దుఃఖం యొక్క అర్థాన్ని, అందులోని లోతును అవగాహన చేసుకోకపోతే, ప్రేమ అంటే ఏమిటో, మరణం అంటే ఏమిటో మీ అంతట మీరే స్వయంగా కనిపెట్టడానికి కావలసిన ఆ శక్తి, ఆ జీవబలం, ఆ గాఢావేశం మీకు వుండదు.

అందుచేత, కాలం అంటే ఏమిటో పరిశీలిద్దాం. గడియారపు కాలం వున్నది. మరో కాలం ఏదైనా అసలు వున్నదా? కాలం అంటే అందులో ఒక ప్రక్రియ వుంటుంది. క్రమంగా అవడం, 'ఉన్నది' మార్పుచెంది 'ఉండవలసినది'గా అవడం. సంప్రదాయ దృష్టి ప్రకారం మార్పు అంటే అందులో కాలం వుంటుంది. అవునా కాదా? 'నేను ఇది, నేను అది అవాలి, నేను మారిపోయి మరొకలాగా అవాలి'-ఇందులో కాలం, క్రమక్రమంగా అవడం అంతర్లీనంగా వుంటుంది. అయితే మానసికంగా మరొకలా అవడం, మానసికమైన పరిణామం అనేది అసలు వున్నదా? నా ప్రశ్న మీకు అర్థమవుతున్నదా? వక్త మిమ్మల్ని ఈ ప్రశ్న అడగడం లేదు. మీకు మీరే ఈ ప్రశ్నను వేసుకుంటున్నారు. చాలా కీలకమైనటువంటి ఈ ప్రశ్నను మనం తప్పక అర్థం చేసుకోవాలి. ఎందుకంటే మరణంతో మనం వ్యవహరించబోతున్నాం. మరణం అంటే కాలంలో భాగం. కాలం అనగానే అందులో ఆలోచనా ప్రక్రియ వుంటుంది. ఆలోచనే కాలం. ఆలోచన భయానికి పుట్టినిల్లు. భయాన్ని పెంచి పోషిస్తుంది. మృత్యువు అని మనం అంటున్న ఈ మహాద్భుతమైన విషయం-ఇది నిజంగా చాలా అద్భుతమైన విషయమే-మనలను ఎంతగానో భయగ్రస్తులను చేసే ఆ ముగింపును, ఆ మరణాన్ని అర్థంచేసుకోవాలంటే, కాలం అంటే ఏమిటి, గడియారం కాలం కాకుండా ఈ మరో కాలాన్ని ఆలోచన ఎందుకని సృష్టించుకున్నది అనేవి మనంతట మనమే పూర్తిగా ఆకళింపుచేసుకోవాలి.

మానసికంగా, అంతర్గతంగా మరొకలాగా అవడం, పరివర్తన చెందడం, మార్పు చెందడం అనేదొకటి వున్నదా? కాలాన్ని కనుక, పర్యవసానాన్ని కనుక, ఒక ప్రక్రియను కనుక వున్నదని ఒప్పుకున్నట్లయితే, అప్పుడు ఏదైనా అందుకోవడానికి కాలాన్ని ఒక సాధనంగా అంగీకరించక తప్పదు. అప్పుడు మార్పు, మానసికమైన మార్పు అంటే ఏమిటి? ఇప్పుడు మనం జీవశాస్త్ర సంబంధిత పరిణామక్రమం గురించి మాట్లాడటం లేదు. నేను ఇంతకు మునుపే సూచించినట్లుగా ఎడ్లబండినుండి జెట్ విమానం వరకు జరిగిన బ్రహ్మాండమైన పరిణామ ప్రక్రియ వున్నది. అపరిమితమైన శాస్త్రవిజ్ఞానాన్ని సేకరించుకుంటూ రావడం వల్ల ఇది జరిగింది. విజ్ఞాన సేకరణ, నిలవ చేసుకోవడము అంటే అందులో కాలం నిబిడీకృతమై వున్నదనమాట. ఇది తప్పితే, ఇక వేరే ప్రక్రియ-ఒక క్రమాభివృద్ధో, సాగుతూ పోయే మార్పో-ఏదైనా వున్నదా? లేదూ కాలపు ప్రసక్తి ఏమాత్రం లేనటువంటి మానసిక విప్లవం ఒకటి వున్నదా? ఒక ప్రక్రియ వున్నది. ఒక క్రమానుగతం వున్నది అని ఒప్పుకోగానే అక్కడ కాలం వచ్చి కూర్చుంటుంది. సాంప్రదాయికమైన విచారణ అంతా దీని ఆధారంగానే సాగుతుంది. సాధన అని, పద్ధతి అని, మరొకలా అవడం, అవకపోవడం అని సంప్రదాయం అంటుంది. ఈ విధానం సమస్తమూ కాలంతో ముడిపడి వుంటుంది. దీనికి చివరన జ్ఞానోదయం-కాంతిదర్శనం, అవగాహన లభిస్తుందని సంప్రదాయం హామీ ఇస్తుంది. కాలం ద్వారా అవగాహన సిద్ధించడం అసలు సాధ్యమా? అది తక్షణమే జరిగే పరిగ్రాహ్యతా? మార్పు తక్షణమే జరుగుతుంది కదూ?

కొనసాగడము అనే గొలుసును, అంటే 'ఉన్నది' నుండి "ఉండవలసినది'కి జరిగే చలనాన్ని త్రెంపివేయడం సాధ్యమా అని అడుగుతున్నాను. లేదూ, కాలంతో సంబంధం లేనటువంటి సంపూర్ణమైన ఉత్పరివర్తనం-'ఉన్నది' యొక్క ఉత్పరివర్తన సాధ్యమా? అది కనిపెట్టాలంటే సాంప్రదాయికమైన ధోరణిని పూర్తిగా వర్జించివేయాలి. సాంప్రదాయిక దృక్పథం అంటే సాధన ద్వారా, పట్టువదలని అభ్యాసం ద్వారా, క్రమానుగత విధానం ద్వారా అందుకోగలము అనే దృష్టి. వీటన్నింటిలో సంఘర్షణ అంతర్లీనంగా వుంటుంది. సరళ సామాన్యమైన ఈ అంశాన్ని దయచేసి అర్థం చేసుకోండి. ఎక్కడైతే సంఘర్షణ వుంటుందో అక్కడ విభజన వుంటుంది. అంటే ఆలోచించే వాడికి ఆలోచనకు మధ్య విభజన, పరిశీలకునికి అతడు సాధించాలి అని అభిలషిస్తున్న అంశానికి - అంటే అదే పరిశీలితము, పరిశీలించబడుతున్న అంశము-మధ్య విభజన. ఆ విభజనలో సంఘర్షణ అనివార్యం. సంఘర్షణ తప్పక వుండి తీరుతుంది. ఎందుకంటే ఎన్నో ఇతర కారణాంశాలు, ఎన్నో ఒత్తిడులు, ఎన్నో సంఘటనలు ఇందులో అంతర్లీనంగా వుంటాయి. అవి కారణాన్ని ఫలితంగా మారుస్తాయి. అప్పుడు ఫలితం మళ్ళీ కారణంగా అవుతుంది. అందుచేత ఇవన్నీ కాలంతో ముడిపడిపోయి వుంటాయి. అవునా కాదా?

మీకో గురువు వున్నట్లయితే, ఆ గురువు వద్దకు మీరు వెళ్ళినప్పుడు, మీరు ఏంచేయవలసినదీ అతడు చెప్తాడు. ఇందులో కాలం వుంటుంది. ఇదంతా మీరు ఒప్పుకుంటారు. ఎందుకంటే మీకు వాటిమీద దురాశ. మీకు ఏదో కావాలి. అది కాలం ద్వారా లభిస్తుందని ఆశపడతారు. సందేహించరు. విచారణచేయరు. మీ గురువుగారితో వాదించరు, చర్చించరు. దానికి అతడు అసలు ఒప్పుకోడు. అతడి మూర్ఖత్వం అది. మీరు అన్నింటికీ అంగీకరిస్తారు. అంతే. ఇక మీరు కాలం - అంటే అదే మోహబంధం - ఆ కాలరంగంలో చిక్కుకొని పోతారు. 'ఉన్నది' నుండి 'ఉండవలసినది'కి నడిచే ఒక చలనం, ఆ మానసిక కాలం ఎక్కడైతే వుంటుందో అక్కడ సంఘర్షణ వుంటుంది-అనే అంశాన్ని మనం విచారణచేసి చూస్తున్నాం. సంఘర్షణ వున్నప్పుడు మనసు తప్పక వక్రంగా తయారవుతుంది. అటువంటి వక్రమైన మనసు సత్యాన్ని ఏనాటికీ కనిపెట్టలేదు. ఇది చాలా సరళ సామాన్యమైన వాస్తవం. స్పష్టతతో చూడాలి అని అనుకుంటున్నప్పుడు నా కంటి చూపు స్వచ్ఛంగా, నిష్కల్మషంగా, ఏ వక్రతలూ లేకుండా వుండాలి. ప్రయత్న ప్రయాస వుంటే వక్రత వుంటుంది. ప్రయత్నము అంటేనే కాలం. ఇది తర్కం కాదు. తార్కికంగా, హేతుబద్ధంగా, ఆరోగ్యంగా, మతిస్థిరంతో అంటున్న మాటగా ఇది ధ్వనించవచ్చు. కానీ ఇది తర్కం కాదు. ఏది అసత్యమో దానిని సూటిగా దర్శించడం ఇది. మెదడు చేయవలసిన పని నిజానికి ఇదే కదా. ఏది అసత్యమో దానిని చూడటం, స్పష్టంగా చూసి గ్రహించడం. క్రమక్రమంగా ఏదో అవుతాను అనే సాంప్రదాయిక ధోరణికి చెందిన ఒక ప్రక్రియను చూసి, అది పూర్తిగా అసత్యమని గ్రహించినప్పుడు, అప్పుడు మీ మనసుకు స్పష్టత కలుగుతుంది.

ఇప్పుడు మనం కలసి వింటున్నప్పుడు, అందరము పాలుపంచుకుంటున్నప్పుడు, కాలంలో ప్రయత్న ప్రయాస ఇమిడి వున్నదనే సంగతి మీ మనసు స్పష్టంగా చూస్తున్నదా? ప్రయత్నము అంటే పరిశీలకునికి పరిశీలితముకి మధ్య పరస్పర వైరుధ్యం,

ఆలోచించే వాడికి, సాధించవలసిన ఒక ఊహాభావనను ముందుకు తీసుకొచ్చిన ఆలోచనకు మధ్య పరస్పర వైరుధ్యం. ఎక్కడైతే విభజన వుంటుందో అక్కడ సంఘర్షణ వుంటుంది. ఉదాహరణకి, హిందువులకి, ముస్లిములకి మధ్య విభజన వున్నప్పుడు సంఘర్షణను ఆహ్వానించినట్లే అవుతుంది. ఇది స్పష్టమైంది కదా? సరే, ఇప్పుడు క్రమాభివృద్ధిలో వున్న అసత్యాన్ని మనసు సూటిగా చూడగలుగు తున్నదా? ఎంత సూటిగా అంటే ఇదిగో ఈ మైక్రోఫోనును చూసినంత సుస్పష్టంగా. దానివలన ఏమీ లాభం లేదని స్పష్టమైంది కదా. ఒక జంతువు, ఒక సర్పం వలన ఎంతటి ప్రమాదం వున్నదో, భయంకరమైన ఒక అడవిమృగం ఎంత ప్రమాదకరమో గ్రహించినట్లుగా. అంటే చూడటం తోటే తక్షణ చర్య జరుగుతుంది.

కాబట్టి, కాలం అనే బంధనంలో చిక్కుకొనిపోయి లేని మనసుకు మాత్రమే పరిగ్రాహ్యత వుంటుంది. దయచేసి ఇది సరిగ్గా అర్థంచేసుకోండి. ఈ అంశాన్ని కనుక అర్థం చేసుకున్నారంటే మీ ఆలోచనా స్వరూపం మొత్తం మారిపోతుంది. పరిగ్రాహ్యత, అవగాహనలలో కాలానికి ఏ మాత్రం తావులేదు. అక్కడ వుండేది ఏమిటీ అంటే స్పష్టతగల దృష్టి. స్పష్టంగా చూడాలంటే ఎడం-ఖాళీ స్థలం వుండాలి. బయట వుండే స్థలమే కాదు, అంతర్గతమైన స్థలం కూడా. అంటే అర్థం మనసులో ఖాళీస్థలం వుండాలీ అని. సరేనా? మనసు కనుక జ్ఞానంతో నిండిపోయి-సాంకేతిక విజ్ఞానం కాకుండా తక్కిన వాటితో, సాంకేతిక విజ్ఞానం అవసరం అనడంలో సందేహంలేదు-మనసు కనుక నిన్న సేకరించిన జ్ఞానంతో, నిన్నటి సంఘటనలతో, నిన్నటి బాధలతో, అనేకమైన నిన్నటి జ్ఞాపకాలతో నిండిపోయి వాగుతూ వుంటే స్థలం ఎక్కడుంటుంది? ఎక్కడయితే స్థలం వుండదో అక్కడ ఘర్షణ వుంటుంది.

మీకు తెలుసా, ఈ ప్రపంచంలో వున్న హింసకు గల మూలకారణాలలో ఒకటి అధిక జనాభా. జనంతో పొరలిపోతున్న నగరాలలో ప్రతి వీధీ మనుష్యులతో క్రిక్కిరిసిపోయి వుంటుంది. అక్కడ ఎడం-ఖాళీస్థలం వుండదు. బాహ్యంలో కూడా మనిషికి స్థలం వుండటం అవసరం. ఎలుకల మీద చుంచుల మీద కొన్ని ప్రయోగాలు చేసి చూశారు. ఈ ఎలుకలను ఎక్కువ సంఖ్యలో ఒక స్థలంలో బంధించి వుంచుతే అవి ఒకదానితో ఒకటి కొట్లాడు కుంటాయి. తల్లే తన పిల్లను చంపుతుంది. పరిస్థితి పూర్తిగా అరాజకమై పోతుంది. ప్రపంచంలో ఇప్పుడు జరుగుతున్నది సరిగ్గా ఇదే. జనసమ్మర్దంతో క్రిక్కిరిసిపోయి వున్న చిన్న, పెద్ద నగరాలలో ఇదే జరుగుతున్నది. బాహ్యంగా ఖాళీస్థలం-ఎడం లేకపోవడం ఒక కారణం. మరొక కారణం ఏమిటంటే అనేక మైన జ్ఞాపకాలతో, అనుభవాలతో-దీనినే జ్ఞానం అంటుంటాము - వీటితో మనసు, మెదడు నిండిపోయి భారంగా వున్నప్పుడు ఖాళీ స్థలం వుండనే వుండదు. మనకి ఈ ఎడం చాలా అవసరం. విస్తారమైన ఖాళీ స్థలం మనసులో వుండకపోవడానికి గల కారణం ఏమిటి?

ఇదంతా అర్థం చేసుకుంటున్నారా? లేదూ వట్టి మాటలను మాత్రమే వింటున్నారా? లేదూ నిజంగానే మీలోకి మీరు శోధిస్తూ చూసుకుంటున్నారా? ఎందుకంటే ఈ ప్రపంచము అంటే మీరే. మీరే ఈ ప్రపంచం. ఏ సభ్యతా సంస్కృతుల్లో మీరు పెరిగారో అది మీలో ఒక భాగమై పోయింది. అందుచేత ఈ సమాజ స్వరూపాన్ని సమూలంగా మార్చా లంటే మిమ్మల్ని మీరు మార్చుకోవాలి. ఎందుకంటే ఆ సభ్యతా సంస్కృతుల్లో మీరూ భాగస్థులు కాబట్టి. మీరే గందరగోళంలో వుండి, మీలోనే కనుక హింసా ప్రవృత్తి వుంటే, మీరు నిర్మించే సమాజం కూడా హింసాయుతంగా, గందరగోళంగా, వికృతంగా వుంటుంది. మీలో కల్మషం వుంటే కల్మషభరితమైన సమాజాన్నే నిర్మిస్తారు.

అందుచేత, అంతర్గతమైన సంఘర్షణ అంతమవాలంటే మీలో ఖాళీ స్థలం వుండాలి. ఎందుకని ఈ ఖాళీ వుండటం లేదు అని ప్రశ్నించుకుంటున్నాం. మీ మనసును మీరు ఎప్పుడైనా నిష్పక్షపాతంగా గమనించి చూశారా? ఎంత అవిశ్రాంతంగా వుంటుందో, ఎప్పుడూ వాగుతూ, జ్ఞాపకాలు నెమరువేస్తూ, ఒక వెర్రి ఆలోచనలో నుండి మరో వెర్రి ఆలోచనలోకి పోతూ, క్రిక్కిరిసిపోయి, గందరగోళంలో పడివుంటుందో గమనించారా? ఎందుకని ఇట్లా జరుగుతున్నది? అది చూసుకోండి. ఈ వక్తను కాదు. మిమ్మల్ని మీరే చూసుకోండి. మీలోకి మీరే శోధించుకోండి. మనసు ఎందుకని ఖాళీగా వుండదు? ఒక కొండ శిఖరంపై నిలబడి చూసినా, విశాలమైన మైదానంలో నిలబడి చూసినా సమస్త క్షితిజాన్ని, విస్తారమైన గగనతలాన్ని, అందులోని సౌందర్యాన్ని, ఆ నిశ్చలత్వాన్ని మీరు చూడ గలుగుతారు. కానీ మన మనసుల్లో మాత్రం బొత్తిగా ఖాళీ స్థలం లేదు. ఎందుచేత?

మీకు తెలుసా, విడిగా విడదీసు కోవడంలో కొంత ఖాళీ స్థలం ఏర్పడుతుంది. వేరుగా విడిపడి వుండటం అంటే ప్రతిరోధం చూపడం అనమాట. ఆ ప్రతిరోధం వున్న చోట కొంత చిన్నదైన ఎడం ఏర్పడుతుంది. ఒక కొత్త భావనకు, ఒక కొత్త జీవన రీతికి మనం నిరోధం చూపుతాము. సంప్రదాయానికి, నా విశ్వాసాలకు తృణీకారం చూపుతే వూరుకోలేను. ఎదిరిస్తాను. ఈ ప్రతిరోధం లోపల, ఈ గోడ వెనకాల కొంత చిన్న ఖాళీ స్థలం వుంటుంది. ఇది ఎప్పుడైనా గమనించారా? ఈ ప్రతిరోధం మన సంకల్పంలో-ఇచ్ఛాబుద్ధిలో ఒక భాగం. 'ఇది నేను చేయాలి', 'నేను అది చేయకూడదు', 'నాకు అదికావాలి'. సంకల్పమే ప్రతిరోధానికి వెనకగల కారణం. సంకల్పం ఆలోచనలో ఒక భాగం. అది ఏమంటుందంటే, 'ఏదైనా సాధించాలి', 'మార్పు జరిగి తీరాలి', 'నేను ఫలానాగా అవాలి' అని.

'నేను' అనే ఆలోచన ఈ విడిగా వేరుచేసుకొనే ప్రక్రియను సాగిస్తున్నది. ఈ ప్రక్రియ కారణంగానే స్థలాభావం ఏర్పడు తున్నది. 'నేను' అనే ఆలోచన సాగించే కార్యకలాపాలు దాని లోపలగా ఒక చిన్న స్థలాన్ని ఏర్పరుస్తాయి. మిమ్మల్ని మీరే కనుక పరిశీలించుకుంటే తెలుస్తుంది. ఒక చిన్న, పరిమితమైన ప్రదేశంలోనే మీరు పని చేస్తుంటారు. ఇది చాలా అతిచిన్న స్థలం. ఈ స్థలం కాలానికి కట్టుబడి వుంటుంది. చాలా చిన్న స్థలం కాబట్టి వాగుతూ వుండాలి. ఎడతెగకుండా పనిచేస్తూ వుండాలి. కదులుతూ వుండాలి. గజగజ లాడుతూ వుండాలి.

(సశేషం)


## క్రొత్త పుస్తకం

జిడ్డు కృష్ణమూర్తి

జీవిత చరిత్ర

రచన : పుపుల్ జయకర్

అనువాదం : సరోజినీ ప్రేమ్‌చంద్

అలకనంద ప్రచురణలు

# 59-6-15, కంచుకోట వీధి,

మేరీస్ స్టెల్లా కాలేజి ఎదురుగా

విజయవాడ-520 008

ఫోను : (0866) 2476966, 2472096

# “ఆ ఏమీలేని శూన్యంలోనే అన్నీ ఉన్నాయి”

సముద్రపు ఒడ్డున కూర్చొని మీరెప్పుడైనా సముద్రాన్ని గమనించారో లేదో నాకు తెలియదు. అలలు లేచి పైకి రావడం, మళ్ళీ వెనకకు మరలిపోవడం గమనించారో లేదో. ఉరుములాంటి పెద్ద చప్పుడుతో తీరాన్ని తాకుతున్న ఏడవ కెరటమే చాలా పెద్దది అన్నట్లుగా ఎప్పుడూ అనిపిస్తుంటుంది. పసిఫిక్ మహాసముద్రంలో అంతగా ఆటు పోట్లు వుండవు. కనీసం ఇక్కడ లేవు. మైళ్ళ తరబడి నీటిని అమిత వేగంతో పొరలించు కుంటూ వచ్చిపడే పోటు అలల వంటివి వుండవు. ఇక్కడ ఎప్పుడూ ఒక చిన్న ఆటు మరో చిన్నపోటు - లోపలకు రావడం, వెనుకకు వెళ్ళిపోవడం. శతాబ్దాల తరబడి ఇది జరుగుతునే వున్నది. సముద్రం వైపు, కనులకు మిరుమిట్లు గొలిపే ఆ వెలుగు తళతళల వైపు, స్వచ్ఛమైన ఆ నీటివైపు ఉత్కృష్ట స్థాయికి పూర్తిగా జాగృతమై పదునెక్కిన మీ గ్రహణేంద్రియాలన్నింటితో కనుక చూడగలిగితే, ఆ పరిశీలనలో గమనిస్తూ వున్న ‘నీవు’ అనబడే ఆ కేంద్రం వుండదు. ప్రతి నిత్యమూ కడగబడి శుభ్రమవుతున్న ఈ ఇసుకను, ఈ సముద్రాన్ని చూడటం గొప్ప సౌందర్య ఆస్వాదన. అక్కడ ఏ అడుగుజాడలూ మిగిలివుండవు. చిట్టి చిట్టి సముద్రపు పక్షులు కూడా తమ జాడలు ఎన్నడూ అక్కడ వదలవు. సముద్రం అన్నింటినీ కడిగి తుడిచివేస్తుంది.

బీచి ఒడ్డునవున్న ఇళ్ళన్నీ చాలా చిన్నవి. తీర్చిదిద్దినట్లుగా వుంటాయి. అక్కడ నివాసం చేసే వారందరూ బహుశ చాలా సంపన్నులై వుంటారు. అయితే అది ఏదీ లెక్కలోకి తీసుకోవలసినది కాదు. వారి ఐశ్వర్యమూ, ఆధునికమైన వారి కార్లు, అసహ్యకరమైన ఆడంబరాలూ ఏవీ కూడా. అక్కడ ఒక పాత మెర్సిడెస్ కారు వున్నది. ఆ కారు బానెట్‌మీద ఒక్కొక్క వైపు మూడేసి చొప్పున పొగపోయే గొట్టాలు వున్నాయి. ఆ కారు స్వంతదారులకు ఆ కారంటే మహా అభిమానంలా వున్నది. బాగా కడిగి మెరిసి పోయేలా శుభ్రంగా తుడిచి పెట్టుకున్నారు. కారును చాలా శ్రద్ధగా చూసుకుంటున్నారు. ఎన్నింటినో కాదనుకుని, ఎంతో డబ్బుపోసి ఈ యంత్రాన్ని కొనుక్కున్నారు. ఆ కారు ఇప్పటికీ బాగా పనిచేస్తున్నది. ఇంకా ఎన్నో వందల మైళ్ళు నడిపించవచ్చు. చాలాకాలం మన్నేటట్లుగా ఆ కారు నిర్మించబడింది.

తీరంలో కూర్చుని పక్షులను, ఆకాశాన్ని గమనిస్తూ, ఎక్కడో చాలా దూరంలో కార్లు పోతూ చేస్తున్న చప్పుడు వింటుంటే ఆ ఉదయం ఎంతో ఆహ్లాదకరంగా తోచింది. ఆటుతో పాటు వెళ్ళి, పోటుతో పాటు తిరిగి వస్తున్నాను. చాలా దూరం వెళుతున్నాము. మళ్ళీ తిరిగి వచ్చేస్తున్నాం. లోపలకు బయటకు, బయటకు లోపలకు-ఇది ఒక అంతులేని నిరంతర చలనం. ఆకాశమూ నీరూ కలిసి పోయినట్లున్న క్షితిజరేఖ వరకు చూడగలుగుతున్నాను. సముద్రం ఇక్కడ ఒక పెద్ద పాయగా లోపలకు చొచ్చుకొని వచ్చింది. తెలుపు, నీలం రంగు నీటితో నిండిన అఖాతం ఇది. చుట్టూరా చిన్నచిన్న ఇళ్ళున్నాయి. మనం కూర్చున్న స్థలానికి వెనుక వైపుగా పర్వతాలున్నాయి. వరుసలు వరుసలుగా. ఒక్క ఆలోచన కూడా లేకుండా గమనిస్తూ వుండటం. ఏ ప్రతిచర్యా లేకుండా గమనించడం. దేనినీ ఫలానా అని గుర్తించ కుండా చూస్తూ వుండటం. అంతూ ఆపూ లేకుండా పూరికే చూస్తూ గమనిస్తూ వుండటం.

నిజంగా చూస్తే నేను జాగృతంగా లేను. పరధ్యానంలో పడిపోయాను. మనసు ఎక్కడికో వెళ్ళిపోయింది. పూర్తిగా అక్కడ లేను. నేను నేను కాదు. కానీ అన్నీ గమనిస్తున్నాను. ఆలోచనలు లేచి రావడం, ఆపైన మెల్లమెల్లగా నిష్క్రమించడం గమనిస్తున్నాను. ఒక ఆలోచన తరువాత మరొకటి. ఆలోచన తన గురించి తానే ఎరుకగా అవుతున్నది. ఆలోచనను గమనిస్తున్న ఆలోచిస్తున్నవాడు లేడు. ఆలోచిస్తున్నవాడే ఆలోచన.

బీచిలో కూర్చొని వచ్చే పోయే వారిని గమనిస్తున్నాను. ఇద్దరు ముగ్గురు జంటలుగా, ఒక ఒంటరి స్త్రీ వెళ్ళారు. ప్రకృతి సమస్తమూ, ఈ లోతైన నీలి సముద్రం వద్దనుండి ఆ ఎత్తయిన శిలా పర్వతాల వరకు, మన చుట్టూ వున్న ప్రతిదీ కూడా గమనిస్తూ వున్నాయని అనిపించింది. గమనిస్తూ వున్నాను. అయితే నిరీక్షించడంలేదు. ఏదో జరుగుతుందని ఎదురుచూడటంలేదు. ఏ లక్ష్యము పెట్టుకోకుండా గమనిస్తూ వున్నాను. ఆ గమనికలో నేర్చుకోవడం వున్నది. అయితే ఈ నేర్వడంలో జ్ఞానాన్ని పోగుచేసుకోవడం వుండదు. జ్ఞానాన్ని పోగుచేసుకొనే నేర్వడం యాంత్రికమైనది. ఇది చాలా జాగ్రత్తగా గమనించడం. పైపైన చూడటం కాదు. లోతుల లోనికి చూడటం. చురుకుగానే కాదు. మృదుత్వంతో గమనించడం. అప్పుడు గమనించేవాడు వుండడు. గమనించేవాడు వుంటే అప్పుడు గమనించేది గతం.

గతం గమనిస్తూ వుంటుంది. అప్పుడది గమనింపు కానేకాదు. అది కేవలం గుర్తు చేసుకోవడం. అది ఒక రకంగా మృతపదార్థం. గమనించడంలో బ్రహ్మాండమైన సజీవత వుంటుంది. ప్రతి క్షణమూ ఒక శూన్యం. ఆ చిట్టిచిట్టి నత్తలు, ఆ నీటి కాకులు, అటూ ఇటూ ఎగురుతున్న పక్షులూ అన్నీ కూడా గమనిస్తూ వున్నాయి. అవి తమ ఆహారం కొరకు, చేపల కోసం చూస్తున్నాయి. తినడానికి ఏమైనా దొరుకుతుందేమోనని చూస్తున్నాయి. అవి కూడా గమనిస్తూనే వున్నాయి. నా పక్కనుంచి నడచి వెళుతున్న ఒకరు నేను గమనిస్తున్నది ఏమిటా అని తనలో తనే ప్రశ్నించుకుంటున్నాడు. నేను వట్టి శూన్యాన్ని గమనిస్తున్నాను. ఆ ఏమీలేని శూన్యంలోనే అన్నీ వున్నాయి.

(‘కృష్ణమూర్తి టు హిమ్‌సెల్ఫ్’నుండి, పుటలు 102-103).

*Published in August, December & April* Periodical

*Registered with The Registrar of Newspapers for India under No. TNTEL/2006/19442*

*If undeliverd please return to:*
KRISHNAMURTI FOUNDATION INDIA
Vasanta Vihar, 124, 126 (Old No. 64, 65) Greenways Road
Chennai - 600 028. Tel: 24937803/24937596
E-mail: publications@kfionline.org
Websites: www.kfionline.org/www.jkrishnamurti.org

*Published by Dr. V. Aravind on behalf of the Krishnamurti Foundation India, Vasanta Vihar, 124, 126 (Old No. 64, 65)Greenways Road, Chennai - 600 028. Printed by N. Subramanian at Sudarsan Graphics Offset Press, 27 Neelakanta Mehta Street, T. Nagar, Chennai - 600 017. Editor : K. Krishnamurthy*